క్లుప్తంగా

ఎల్లమ్మను ప్రతిష్ఠించి.. మొక్కులు చెల్లించి



బోనంతో ఆలయానికి వెళ్తున్న భక్తురాలు

మోతె : మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మతల్లి ఆలయంలో ఎస్సీ కాలనీవాసులు మంగళవారం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయంలో దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యం, యాటపోతులు, కోళ్లు బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి కృపతో సంతానం ప్రాప్తిస్తుందనే నమ్మకంతో కొందరు భక్తులు శ్రీదేవి వేషధారణలో వెళ్లి అమ్మవారికి పూజలు చేశారు. కుల పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

28న మహా భోగ్ భండారో

హుజూర్‌నగర్ : సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో భాగంగా హుజూర్‌నగర్‌లో ఈనెల 28న నిర్వహించే మహా భోగ్ భండారోలో గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మఠంపల్లి మండల అధ్యక్షుడు భూక్యా మంజినాయక్ కోరారు. ఉత్సవాలను నిర్వహణ కోసం మంగళవారం పట్టణంలోని టౌన్ హాల్‌ను నిర్వహణ కమిటీతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ బానోతు తులసిరామ్‌నాయక్, కోకన్వీనర్ సైదులు, నాయకులు వీటినాయక్, భాస్కర్, బాలాజీ, నాగేశ్వరరావు, సురేష్, చంద్రమౌళి, రవి, బలరాం, శంకర్, గోవిందు, నాగరాజు, మేఘూ, భిక్షం పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారుడికి సన్మానం



అనిల్‌ను సన్మానిస్తున్న యువత

నేరేడుచర్ల : మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన సంకబుడ్డి అనిల్ తెలంగాణ రాష్ట్రం తరుపున జాతీయ స్థాయి కబడ్డీ పోటీలో పాల్గొని తిరిగి స్వగ్రామానికి చేరుకున్నాడు. మంగళవారం అనిల్‌ను గ్రామ యువత శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బుడిగే సతీష్‌కుమార్, చామకూరి వినోద్, ఫణికుమార్, సతీష్, వీరస్వామి, వినయ్, మనోజ్, నవీన్, వేణు, సంజయ్ తదితరులు ఉన్నారు.

నర్సరీలను సక్రమంగా నిర్వహించాలి

గరిడేపల్లి : మండలంలోని నర్సరీలను ఫీల్డ్ అసిస్టెంట్లు సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ సరోజ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని నర్సరీని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవిలో మొక్కలు ఎండిపోకుండా నీటిని అందించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రాయికింది సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ మేకపోతుల సరిత, కానుగు పద్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా వస్తువులు అందజేత

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కబడ్డీ జాతీయ క్రీడాకారుడు మోర్తాల నాగిరెడ్డి అన్నారు. మంగళవారం చింతలపాలెంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.5 వేల విలువ గల స్పోర్ట్స్ కిట్లును ఆయన అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎస్.శ్రీనివాస్, పీడీ ఉస్మాన్, కబడ్డీ క్రీడాకారుడు టి.శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పార్వతీ పరమేశ్వరులను తాకిన సూర్యకిరణాలు



మూలవిరాట్లపై పడుతున్న సూర్యకిరణాలు

గరిడేపల్లి: మండల కేంద్రంలోని శివాలయంలో పార్వతీపరమేశ్వరుల మూలవిరాట్లను మంగళవారం సూర్యకిరణాలు తాకాయి. ప్రతి సంవత్సరం మాఘ మాసంలో శివరాత్రికి ముందు రోజు లేదా శివరాత్రి రోజున సూర్యకిరణాలు గర్భగుడిలోని దేవతామూర్తుల విగ్రహాలపై పడుతాయని అర్చకుడు కొంపెల్లి కృష్ణశాస్త్రి తెలిపారు. ఈ విశేషాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఆలోచన ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు

చిలుకూరు : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రతిఒక్కరూ చేయూత నివ్వాలని ఆలోచన ఫౌండేషన్ చైర్మన్ ములుగురు నాగరాజు కోరారు. మంగళవారం చిలుకూరు మండలంలోని ఆచార్యులగూడెంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు ఆలోచన ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేసి మాట్లాడారు. హెచ్‌ఎంలు కల్లు రామిరెడ్డి, నరసింహారెడ్డి, చైర్మన్ మైలారిశెట్టి నాగమణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరేదెప్పుడో!

- సీతారాంపురంలో అసంపూర్తిగా 25 డబుల్ బెడ్‌రూం ఇళ్లు
- స్లాబ్ దశలో నిలిచిన పనులు
- పశువులను కట్టేస్తున్న రైతులు
- నిర్మాణాలు పూర్తిచేసి పంపిణీ చేయాలని పేదల వేడుకోలు



సీతారాంపురంలో స్లాబ్ దశలో నిలిచిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు



అసంపూర్తిగా ఉన్న ఇంట్లో గేదెలను కట్టేసిన రైతు

హుజూర్‌నగర్‌రూరల్ : పేదోడి సొంతింటి కల ఏళ్లుగా కలగానే మిగులుతోంది. ప్రభుత్వాలు మారుతున్నా పేదలను పట్టించుకోవడం లేదు. హుజూర్‌నగర్ మండలంలోని సీతారాపురంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. 2017లో రూ. 1. 57 కోట్ల వ్యయంతో చేపట్టిన 25 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలకు అప్పటి మంత్రి జగదీష్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. 2018 లో ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఏడేళ్లుగా కావొస్తున్నా కేవలం 10 ఇళ్ల నిర్మాణాలు మాత్రమే 70 శాతం పూర్తయ్యాయి. మరో 15 ఇళ్ల నిర్మాణాలు పిల్లర్లు, స్లాబ్ లెవల్‌లోనే ఆగిపోయాయి. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు ముగ్గురు కాంట్రాక్టర్లు మారారు. వారికి గిట్టుబాటు కాకపోవడం, సమయానికి నిధులు విడుదల కాక నిర్మాణాలను మధ్యలోనే వదిలేసి వెళ్లారు.

పశువుల కొట్టాలుగా..

కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి 15 నెలలు అవుతున్నా డబుల్ బెడ్ రూం ఇళ్ల వైపు కన్నెత్తి చూడలేదు. ఇక అసంపూర్తిగా ఉన్న ఇళ్లను కొందరు పశువులకు కొట్టాలుగా ఉపయోగించుకుంటున్నారు. మరికొన్ని ఇళ్లు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఇళ్లను కంపచెట్లు కమ్మేశాయి. ఇళ్ల చుట్టూ ప్రహరీ, మరుగుదొడ్లు, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాల్సి ఉంది. విద్యుత్ సరఫరా ఇవ్వాల్సి ఉంది. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి వసతులు కల్పించేసరికి ఇంకా ఎన్నేళ్లు పడుతుందోనని నిరుపేద కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గుడిసెలో బతుకుతున్నాం



డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ కోసం ఆరేళ్లుగా ఎదురుచూస్తున్నాం. ఇల్లు లేక ప్రస్తుతం గుడిసెలో బతుకుతున్నాం. గుడిసెలోకి తేళ్లు, పాములు వస్తుండటంతో భయంభయంగా గడుపుతున్నాం. గుడిసెలో నలుగురం ఉండాలంటే ఇబ్బందిగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించి పేదలకు పంచాలి.

– బైరు చంద్రయ్య, సీతారాంపురం

ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి



గత ప్రభుత్వంలో సీతారాంపురంలో చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిచాయి. కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చొరవ తీసుకొని నిలిచిపోయిన ఇళ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. అర్హులైన పేదలను గుర్తించి ఇళ్లను పంపిణీ చేయాలి.

– గునగంటి కనకయ్య, సీతారాంపురం

ఆరేళ్లుగా అసంపూర్తిగానే..



సీతారాంపురంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఆరేళ్లుగా అసంపూర్తిగానే ఉన్నాయి. ప్రభుత్వాలు మారినా పేదోళ్లను పట్టించుకునే నాథుడు కరువయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించి అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేయించి అర్హులైన పేదలకు పంపిణీ చేయాలి.

– పోషణబోయిన హుస్సేన్, సీపీఎం మండల కార్యదర్శి, హుజూర్‌నగర్

ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు, మహిళలు

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామానికి చెందిన బీఎస్పీ, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మాజీ ఎంపీపీ బజ్జూరి వెంకట్‌రెడ్డి, ఎన్‌ఆర్‌ఐ బజ్జూరి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కోదాడలో ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. సంక్షేమ పథకాలను పేదలకు అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో బేతవోలు పీఏసీఎస్ చైర్మన్ బజ్జూరి రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కీత వెంకటేశ్వర్లు, పంద్రాతి హనుమంతరావు, నాయకులు రెమిడాల ఆనందరావు, వనపర్తి రామారావు, బిట్టు అజయ్, వరకుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమయాన్ని వృథా చేయొద్దు

- కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

కోదాడ : విద్యార్థులు సమయాన్ని వృథా చేయొద్దని, క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి కోరారు. మంగళవారం కోదాడలోని కేఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్న విషయాన్ని విద్యార్థులు అనుక్షణం గుర్తుంచుకోవాలని కోరారు. సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రమణారెడ్డి, అధ్యాపకులు వేముల వెంకటేశ్వర్లు, పిచ్చిరెడ్డి, యాదగిరి, రాజేష్, ఎం.రత్నకుమారి, బి.రమేష్‌బాబు, వెంకన్న, నాగరాజు, తిరుమల, గోపికృష్ణ, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ధాన్యం బోనస్ విడుదల చేయాలి

నేరేడుచర్ల : రైతులకు ధాన్యం బోనస్ తక్షణమే విడుదల చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షుడు తాళ్ల నరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నేరేడుచర్లలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం నేటికీ చెల్లించలేదన్నారు. రైతులకు రుణమాఫీ కూడా పూర్తి స్థాయిలో చేయలేదని తెలిపారు. మూడు ఎకరాలలోపు భూమి ఉన్న రైతులకు కూడా యాసంగిలో పెట్టుబడి సాయం అందలేదన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

హుజూర్‌నగర్ : ఈనెల 27న జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని సీఐ చరమందరాజు అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని పోలింగ్ స్టేషన్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సర్కిల్ పరిధిలో మొత్తం 430 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. పట్టణంలోని బాలకల ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో 185 మంది, గరిడేపల్లి ఎంపీపీఎస్ పోలింగ్ కేంద్రంలో 94 మంది, నేరేడుచర్లలోని జడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో 95 మంది, పాలకవీడు జడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో 22 మంది, మఠంపల్లిలోని ఎంఆర్‌సీ పోలింగ్ కేంద్రంలో 34 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని ఆయన తెలిపారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఒక్కో పోలింగ్ సెంటర్ వద్ద ఆరుగురు పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

సోమప్ప ఆలయంలో సహాయ కమిషనర్ పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ భాస్కరశర్మ

నేరేడుచర్ల : మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని సోమప్ప దేవాలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా దేవాదాయ శాఖ ఉమ్మడి నల్లగొండ జిల్లా సహాయ కమిషనర్ కోదాటి భాస్కరశర్మ సోమేశ్వరుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం మహాశివరాత్రి వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిత్తలూరి సత్యనారాయణ, ఎంపీడీఓ సోమ సుందర్‌రెడ్డి, ఈఓ మృత్యుంజశాస్త్రి, వెంకటనారాయణ, ఎస్ఐ రవీందర్ నాయక్, ఆలయ వైస్ చైర్మన్ లోడంగి లక్ష్మయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొణతం చిన వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెల్లంకొండ విజయలక్ష్మీ నర్సింహారావు, వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, పెండెం సైదులు, సోములు, బాలమణి, నాగు, గణేష్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస శాస్త్రి ఉన్నారు.

శివాలయానికి రథం బహూకరణ



పాలకవీడు : శివాలయానికి రథాన్ని బహూకరిస్తున్న దాతలు

పాలకవీడు : మహా శివరాత్రిని పురస్కరించుకొని మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామంలో గల శ్రీపార్వతీ రామలింగేశ్వరస్వామి దేవాలయానికి మంగళవారం అదే గ్రామానికి చెందిన నంద్యాల ధర్మారెడ్డి, పాపిరెడ్డి వారి తల్లిదండ్రులు గురవారెడ్డి, లక్ష్మీనర్సమ్మ జ్ఞాపకార్థం రథాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకంతో పూజలు ప్రారంభమవుతాయని, రాత్రి పార్వతీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవం ఉంటుందని ఆలయ చైర్మన్ బూషిపల్లి వెంకట్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు శేరి సురేందర్‌రెడ్డి, వెంకటాచారి, కిష్టిపాటి సత్యనారాయణరెడ్డి, మునగాల సోమిరెడ్డి, మునగాల భాస్కర్‌రెడ్డి, బోగాల చంద్రశేఖర్‌రెడ్డి, లచ్చిరెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రిటైర్డు ఉద్యోగుల జన్మదిన వేడుకలు



వేడుకలు నిర్వహిస్తున్న రిటైర్డు ఉద్యోగుల సంఘం నాయకులు

నేరేడుచర్ల : మండల కేంద్రంలోని రిటైర్డు ఉద్యోగుల భవనంలో మంగళవారం రిటైర్డు ఉద్యోగులు పులిజాల వెంకటరమణరావు, పులిజాల సీతారామారావు జన్మదిన వేడుకలను రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సామూహికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిటైర్డు ఉద్యోగులు పూర్ణ చంద్రారెడ్డి, వీరభద్రరావు, రాంరెడ్డి, రంగారెడ్డి, సత్యనారాయణ, సుందరయ్య, లక్ష్మారెడ్డి, వెంకటేశ్వర్లు, రామస్వామి, బుద్ధారెడ్డి, తెరిసా, సైదిరెడ్డి తదితరులు ఉన్నారు.

సైన్స్ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

మఠంపల్లి : ఫిబ్రవరి 28న జరిగే జాతీయ సైన్స్ దినోత్సవంలో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని జేవీవీ రీసోర్స్ పర్సన్ పీవీ దుర్గాప్రసాద్ కోరారు. మంగళవారం మండలంలోని మఠంపల్లి, భీల్యానాయక్‌తండా, వరదాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో, మోడల్‌స్కూల్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ ప్రగతిలో సైన్స్ పాత్ర, డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం గురించి వివరించారు. ఆయా కార్యక్రమాలలో హెచ్‌ఎంలు రాము, వీరబాబు, శ్రీనివాస్, కాంతయ్య, వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని గ్రీన్ ఉడ్ (కృష్ణవేణి) పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్య ప్రదర్శనలు చేసి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం తుమ్మ మర్రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మారయ్య, ఉపాధ్యాయులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం



ముస్తాబైన వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం

చిలుకూరు : మండలంలోని దూదియాతండాలో బుధవారం శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబ లోక కల్యాణ మహోత్సవాన్ని ఆలయ మఠాధిపతులు పమ్మి బ్రహ్మాచారి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కల్యాణ వేడుకలో భాగంగా ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం స్వామివార్ల ఊరేగింపు నిర్వహిస్తున్నామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పమ్మి బ్రహ్మాచారి కోరారు.

మహాశివరాత్రి వేడుకలకు ఆలయాలు ముస్తాబు



మునగాలలో ముస్తాబైన చెరువుగట్టు శివాలయం



కోదాడరూరల్ : తొగర్రాయిలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



గరిడేపల్లి : పొనుగోడులోని త్రిలింగేశ్వర ఆలయంలో హోమంలో పాల్గొన్న భక్తులు

మునగాల : మండల కేంద్రంలో బుధవారం నిర్వహించే మహాశివరాత్రి వేడుకలకు చెరువుగట్టు స్వయంభూ శివాలయం, శ్రీరామలింగేశ్వర హనుమాన్ ఆలయం, శ్రీవేంకట కనకదుర్గ ఆలయాలు ముస్తాబయ్యాయి. రంగురంగుల విద్యుత్ దీపాలతో ఆలయాలను ముస్తాబు చేశారు. ఆలయ కమిటీలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. తాడువాయి పురాతన శివాలయంలో బుధవారం మండల కేంద్రానికి చెందిన ఉత్తమ్ పద్మావతి యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు తొగాటి వేలాద్రి –హైమావతి దంపతుల ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది.

విజయవంతం చేయాలి

చిలుకూరు : మండల వ్యాప్తంగా బుధవారం జరిగే శివరాత్రి వేడుకలకు శివాలయాలు ముస్తాబయ్యాయి. చిలుకూరు, బేతవోలు గ్రామాల్లో గల శివాలయంలో స్వామివారి కల్యాణంతో పాటు అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి

నడిగూడెం : మండలంలోని సిరిపురం, నారాయణపురం గ్రామాల మధ్య సాగర్ ఎడమ కాల్వ కట్టపై ఉన్న శ్రీ సంగమేశ్వరస్వామి ఆలయం బుధవారం జరగనున్న మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాల నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు.

మఠంపల్లి : మహాశివరాత్రి ఉత్సవాలకు మండలంలోని శివాలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా ముస్తాబు చేశారు. మఠంపల్లి, చౌటపల్లి, రఘునాథపాలెంలలో శ్రీరామలింగేశ్వరాలయాలు, పెదవీడులోని సోమలింగేశ్వరాలయం, యాతవాకిళ్లలోని శ్రీ బసవ లింగేశ్వరాలయాలలో వేడుకలకు సిద్ధం చేశారు. శివాలయాలలో భక్తుల దర్శనానికి ఏర్పాట్లు చేశారు.

మోతె : మండలంలోని కూడలిలో గల శ్రీసంగమేశ్వరస్వామి ఆలయాన్ని బుధవారం జరగబోయే మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబు చేశారు. కూడలి సంగమేశ్వర ఆలయానికి మోతె మండలంతో పాటు ఆత్మకూర్(ఎస్),నూతనకల్, ఖమ్మం జిల్లాలో తిర్మలాయపాలెం మండలం నుంచి భక్తులు వేలాదిగా తరలిరానున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పాలేరు వాగులో పుణ్య స్నానాలు ఆచరించి ఆలయంలో పూజలు నిర్వహిస్తారని తెలిపారు.

పొనుగోడులో హోమం

గరిడేపల్లి : మహాశివరాత్రి వేడుకలకు గరిడేపల్లి, పొనుగోడు, కీతవారిగూడెం గ్రామాల్లోని శివాలయాలు ముస్తాబయ్యాయి. పొనుగోడులో కాకతీయ రాజులు నిర్మించిన త్రిలింగేశ్వర దేవాలయంలో వేడుకలు ప్రారంభమయ్యాయి. మంగళవారం ఆలయంలో హోమం నిర్వహించారు. శివరాత్రిని పురస్కరించుకొని బుధవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు, శివుని కల్యాణం నిర్వహించనున్నారు. ఆలయాల్లో జ్వాలాతోరణం చేపడతారు. ఈమేరకు ఆయా ఆలయాల కమిటీ సభ్యులు అన్ని ఏర్పాటు చేశారు.

అంకురార్పణతో వేడుకలు ప్రారంభం

కోదాడరూరల్ : మండలంలోని తొగర్రాయిలో గల ప్రాచీన భ్రమరాంబ సమేత శ్రీరామలింగేశ్వస్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా ప్రారంభయ్యాయి. మంగళవారం మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ఆవరణను మామిడి తోరణాలతో అలంకరించారు. అనంతరం గణపతిపూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, పంచగవ్యప్రాసన, అఖండ స్థాపన, మండపారాధన, అంకురార్పణ, ధ్వజరోహణ, వృషభ ముద్దలు వంటి వైదిక క్రతువును నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున అభిషేకాలు, రాత్రి 8గంటలకు స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. స్వామి వారికి పట్టు వస్త్రాలను యాదా శ్రీనివాసరావు– మీనా, ఉపేందర్– సంగీత దంపతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యాదా శ్రీనివాసరావు, వేణుగోపాల స్వామి, ఆలయ చైర్మన్ అమరనాయిని వెంకటేశ్వరరావు, నందుల లక్ష్మీనరసింహశాస్త్రి, వెంకటేశ్వర్లు, నాగరాజు, మధు, లక్ష్మీనారాయణ, రవీందర్ తదితరులు ఉన్నారు.



గరిడేపల్లి : ముస్తాబైన త్రిలింగేశ్వర స్వామి ఆలయం



మఠంపల్లి : చౌటపల్లి గ్రామంలోని రామలింగేశ్వరాలయం

బాలకోటేశ్వరస్వామి జాతరకు వేళాయే



జాతరకు ముస్తాబైన ఆలయం

నడిగూడెం : మహా శివరాత్రిని పురస్కరించుకొని నడిగూడెం మండలంలోని వల్లాపురం రెవెన్యూ పరిధిలో 410 ఏళ్ల కిందట వెలిసిన శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయం జాతరకు ముస్తాబైంది. బుధవారం నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ఇక్కడ జాతర జరగనున్నది. బుధవారం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, రాత్రి స్వామి వారి కల్యాణం, 27న ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జక్కపల్లిలో, 28న వల్లాపురంలో, మార్చి 1న అనంతగిరి మండలం చనుపల్లిలో స్వామివారి ఊరేగింపు నిర్వహించనున్నారు. జాతరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు, ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కృష్ణ తదితర జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు హాజరుకానున్నారు. భక్తులకు తాగునీరు, మౌలిక వసతి ఏర్పాటు చేసినట్లు ఆలయ ధర్మకర్త ఏలేటి ఎల్లారెడ్డి, చైర్మన్ పల్లా మోహన్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు ఇంగువ సంగమేశ్వరప్రసాద్‌శర్మ మంగళవారం తెలిపారు. కాగా, ఆలయ పరిధిలోని గుట్టపై ఉన్న కోనేరులో నిత్యం నీరుంటుందని స్థానికులు చెబుతున్నారు. ఈ ఆలయంలో పూజలు చేస్తే కోరిన కోర్కెలు తీరుతున్నాయని పలువురు భక్తులు నమ్ముతారు.

ఆంజనేయస్వామికి నాగవల్లీ దళార్చన



పూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి, గోపాలపురంలోని శ్రీఆంజనేయస్వామి దేవాలయాల్లో మంగళవారం ఆంజనేయస్వామికి నాగవల్లీ దళాలతో సహస్రనామార్చన నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, ఆంజనేయస్వామికి పంచామృతాలు, 108 తమలపాకులతో అభిషేకం, ఆకుపూజ, గంధ సింధూరం, మన్యసూక్త పారాయణం, శ్రీరామ, ఆంజనేయ అష్టోత్తర శతనామావళి, అలంకరణ, తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. బూరుగడ్డ ఆలయ చైర్మన్ యరగాని గురవయ్యగౌడ్, ఈఓలు ఎంపి లక్ష్మణరావు, చలపతి, అర్చకులు హరీష్‌కుమార్ చార్యులు, నర్సింహాచార్యులు, అన్వేష్‌కుమార్‌చార్యులు, ధర్మకర్తలు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

స్వపరిపాలన దినోత్సవం



స్వపరిపాలన వేడుకలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని లింగగిరి ఎస్సీ కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ధనలక్ష్మి, ఉపాధ్యాయులు నజీమా, జ్యోతి, చందు తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను వీడాలి

హుజూర్‌నగర్ : విద్యార్థులు విజ్ఞానం వైపు అడుగులు వేయాలని, మూఢనమ్మకాలను వీడాలని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.రామారావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర బాధ్యులు పి.దుర్గా ప్రసాద్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ఐక్యూఏసీ, సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సైదులు, వైస్ ప్రిన్సిపాల్ సునంద, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ప్రియాంక, అధ్యాపకులు డాక్టర్ నగేష్, బాలరాజు, డాక్టర్ జే.వెంకటేశ్వర్లు, బి.నాగార్జున, పి.శ్రీనివాస్, ఏ.స్వాతి విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులు ప్రాణాలతో తిరిగి రావాలని ప్రార్థనలు

గరిడేపల్లి : ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న కార్మికులు ప్రాణాలతో తిరిగి రావాలని కోరుతూ గరిడేపల్లి మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మంగళవారం ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు జంజనం కోటేశ్వరరావు, ఎస్కె పాష, మస్తాన్, నాగుల్‌మీరా, విజయ్, వెంకటమ్మ, భద్రమ్మ, లక్ష్మి, శ్రీదేవి, భూలక్ష్మి, స్వప్న, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.